సాక్షి
జనగామ
బుధవారం | 18 | అక్టోబర్ | 2023



**సమసమాజ స్థాపనకు ఉద్యమించాలి** - 10లో▸

విద్యార్థులు రాజకీయంగా ఎదగడం ద్వారానే మెరుగైన సమాజం సాధ్యమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు.



**విద్యుత్ ఉద్యోగులు హెడ్ క్వార్టర్స్‌లో ఉండాలి**

విద్యుత్ ఉద్యోగులు హెడ్ క్వార్టర్స్‌లో ఉంటూ విధులు నిర్వర్తించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు అన్నారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
$33.5^0/23.5^0$

**వాతావరణం**

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరు జల్లు లు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### లలితా త్రిపుర సుందరిదేవీ అలంకరణలో అమ్మవారు



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మూడవ రోజు చండిక అమ్మవారు శ్రీలలిత త్రిపుర సుందరి దేవీ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి చండీహోమం నిర్వహించారు. భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బి.లక్ష్మీప్రసన్న, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### జోనల్‌స్థాయి క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ



స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు జోనల్‌స్థాయిలో అండర్ 19 విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కై వసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ కాళహస్తి తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 16వ తేదీవరకు యాదాద్రి జిల్లా భువనగిరిలో జరిగిన 9వ జోనల్‌స్థాయి గురుకుల క్రీడాపోటీల్లో స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో వ్యక్తిగత క్రీడాంశంతో పాటు టీమ్‌గేమ్స్‌లోనూ నైపుణ్యంతో ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారన్నారు. వ్యక్తిగత చాంపియన్ షిప్‌తో పాటు ఓవరాల్ చాంపియన్ షిప్ గెలుచుకున్న కళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ జి.శ్రీనివాస్, పీఈటీ రాణాప్రతాప్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.సమ్మయ్య, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ జయందర్ తదితరులు అభినందించారు.

### చెక్‌పోస్టును తనిఖీ చేసిన డీసీపీ



జనగామ: సాధారణ ఎన్నికల సమయంలో హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారి జనగామ మండలం పెంబర్తి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును మంగళవారం డీసీపీ పి.సీతారాం తనిఖీ చేశారు. ఏసీపీ దేవేందర్ రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్‌తో కలిసి డీసీపీ వాహనాలను తనిఖీ చేశారు. వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, కాంగ్రెస్ నేత మాణిక్ రావు ఠాక్రే వాహనాలను కూడా తనిఖీ చేశారు. ప్రతిఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు.

### కలెక్టర్‌పై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు



జనగామ రూరల్: జిల్లా కలెక్టర్‌పై మంగళవారం స్వేరో స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు మాదారపు విజయ్‌కుమార్ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. ప్రజల శ్రేయస్సుకు పనిచేయాల్సిన కలెక్టర్ ప్రజా పాలకుల కోసం పనిచేస్తున్నాడని, రాజ్యాంగ హోదాలో ఉండి అధికార పార్టీకి అనుకూలంగా పనిచేయడం సరికాదన్నారు. తక్షణమే ఎన్నికల సంఘం స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

### తపాలాసేవలు వినియోగించుకోవాలి

దేవరుప్పుల: గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ హనుమకొండ, ఎస్పీ వి.హనుమంతు సూచించారు. మంగళవారం మండలంలోని నీర్మాలలో జనగామ ఈస్ట్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భద్రతతో కూడిన చిన్న మొత్తాల పొదుపు పథకాలు, తక్కువ రేటులో ఇన్సూరెన్స్ పథకాలను వ్యవసాయ కార్మికులు, గీత కార్మికులు, హమాలీ వర్కర్లు, ప్రభుత్వ ఉద్యోగులు ఉపయోగించుకొని లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో సబ్ పోస్ట్‌మాస్టర్ నర్సింహులు, మెయిల్ ఓవర్ సీయర్ భాస్కర్, స్థానిక బ్రాంచి పోస్ట్‌మాస్టర్ యాదగిరి, నవాబు పేట సబ్ పోస్ట్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల భద్రతకే మొదటి ప్రాధాన్యం



**ప్రశాంత ఎన్నికల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం**

- కమిషనరేట్ పరిధిలో పోలింగ్ కేంద్రాలు 1,126.. పోలింగ్ స్టేషన్లు 2,125
- 24 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించాం
- ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే ఊరుకునేది లేదు
- ఇప్పటికే 1,796 మందిని బైండోవర్ చేశాం..
- రూ.1.01 కోట్లు నగదు పట్టివేత
- 'సాక్షి'తో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: 'ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వివిధ రాజకీయ పార్టీలు ఎత్తుగడలు వేస్తుంటాయి. వాటిని అరికట్టి ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే పరిస్థితులు కల్పించాలి. అందుకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయడం పోలీసుల విధి. ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించే, అటువంటి ప్రయత్నం చేసేవారి పట్ల చాలా కఠినంగా వ్యవహరిస్తాం.' అని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. జిల్లాలో ఎన్నికల వేడి రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇప్పటికే షెడ్యూల్ విడుదల కావడం.. నోటిఫికేషన్‌కు సమయం దగ్గర పడుతుండడంతో కమిషనరేట్ పరిధిలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలపై మంగళవారం ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

**ఆరు నెలలుగా కసరత్తు**

ప్రతి ఓటరు తన ఓటు హక్కును ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆరు నెలలుగా పోలీస్‌శాఖ కసరత్తు చేస్తోంది. దీనికోసం 24 గంటల పాటు కమిషనరేట్ వ్యాప్తంగా 11 నియోజకవర్గాల్లో 24 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు గస్తీ నిర్వహిస్తున్నాయి. వీటితోపాటు 10 డైనమిక్ బృందాలు పనిచేస్తున్నాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు జీపీఎస్ అమర్చడంతోపాటు కెమెరాలను ఏర్పాటు చేశాం. ప్రతి బృందంలో ఒక వీడియోగ్రాఫర్ ఉంటారు. ప్రజలను ప్రలోభపెట్టేందుకు ఎవరు, ఎక్కడ ప్రయత్నం చేసినా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వారిని పట్టుకుని సామగ్రిని సీజ్ చేస్తాయి.

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు**

ఎన్నికల నిబంధనలను ఎవరు అతిక్రమించినా కఠిన చర్యలు ఉంటాయి. రాజకీయ పార్టీల నేతలకు ఇప్పటికే ఈ విషయంపై పలుమార్లు అవగాహ న కార్యక్రమాలు నిర్వహించాం. గతంలో ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించిన వారిని, వివిధ కేసుల్లో నిందితులను బైండోవర్ చేశాం. 2018 ఎన్నికల సమయంలో కమిషనరేట్ వ్యాప్తంగా 9,600 మందిని బైండోవర్ చేశారు. ప్రస్తుత ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటినుంచి 1,796 మందిని బైండోవర్ చేశాం. ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

**భారీ బందోబస్తు**

గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. నలుగురు డీసీపీలు, 16 మంది ఏసీపీలు, 50 మంది ఇన్‌స్పెక్టర్లు, 141 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 525 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, హెడ్ కానిస్టేబుళ్లు, 1,100 మంది కానిస్టేబుళ్లు, 550 మంది హోంగార్డులు, సుమారు 2,400 మంది పారామిలటరీ పోలీసులు ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు.

**కమిషనరేట్ పరిధిలో 11 నియోజకవర్గాలు**

కమిషనరేట్ పరిధిలో 11 నియోజవకర్గాలు (పరకాల, నర్సంపేట, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట నియోజవర్గాలు పూర్తి స్థాయిలో, పాలకుర్తి, జనగామ, హుజూరాబాద్, హుస్నాబాద్, భూపాలపల్లి నియోజకవర్గాల్లోని కొన్ని మండలాలు) ఉన్నాయి. కమిషనరేట్ వ్యాప్తంగా 21,55,057 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 10,69,716 మంది, స్త్రీలు 10,85,057, ట్రాన్స్‌జెండర్లు 284 మంది ఉన్నారు. పోలింగ్ స్టేషన్లు 2,125 ఉండగా, ఇందులో సమస్మాత్మకవి 551, సాధారణ పోలింగ్‌స్టేషన్లు 1,574 ఉన్నాయి. పోలింగ్ కేంద్రాలు 1,126 ఉండగా వీటిలో సమస్మాత్మక 383, సాధారణ కేంద్రాలు 743 ఉన్నాయి.

**ప్రజాస్వామ్యయుతంగా ముందుకు సాగాలి..**

అందరికి ఎన్నికల నిబంధనలు వర్తిస్తాయి. రాజకీయ పార్టీలు కూడా ఐదుగురు దాటితే ఎన్నికల అధికారి అనుమతి తీసుకుని సమావేశాలు నిర్వహించుకోవాలి. ప్రతి రాజకీయ పార్టీ నేతలు ప్రజాస్వామ్యయుతంగా ముందుకు సాగాలి. స్థానిక పోలీసులతో పాటు పారామిలటరీ బలగాలతో ఫ్లాగ్, రూట్ మార్చ్‌లు నిర్వహిస్తాం. ప్రజలు అన్ని రకాలుగా పోలీసులకు సహకరించాలి.

**స్వచ్ఛందంగా ఫిర్యాదు చేయండి**

ఎన్నికల్లో రాజకీయ పార్టీలు మద్యం, డబ్బులు, ఇతర వస్తువులు పంపిణీ చేస్తే ప్రజలు స్వచ్ఛందంగా 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. అది నేరుగా ఎన్నికల సంఘానికి వెళ్తుంది. దీంతో పాటు సీ విజిల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదు చే యవచ్చు. కమిషనరేట్‌లో గత, ప్రస్తుత పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయి. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. భూ కబ్జాదారులు, రౌడీలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎవరైనా ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే ఊరుకునేది లేదు. చర్యలు కఠినంగా ఉంటాయి. పీడీయాక్టు వంటి చట్టాలను ప్రయోగిస్తాం.

**అడుగడుగునా తనిఖీలు**

ఎన్నికల్లో ఓటర్లను మభ్యపెట్టకుండా ఉండేందుకు పోలీసులతోపాటు ప్రత్యేకంగా 24 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశాం. దీంతో పాటు ఎల్కతుర్తి, కేయూసీ, నర్సంపేట, మిల్స్ కాలనీ, జనగామ, బచ్చన్నపేట, దేవరుప్పుల, రాయపర్తి దగ్గర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. 10 డైనమిక్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించాం. ఈ నెల 9న ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటినుంచి ఇప్పటికే రూ.1.01 కోట్ల నగదు, రూ.14.92 లక్షల విలువ గల 13,400 కిలోల బెల్లం, 1,636 లీటర్ల గుడుంబా, రూ.87 లక్షల విలువ గల 351 కిలోల గంజాయి, బ్యాగులు, చీరలు పట్టుకున్నాం. తనిఖీలు చేపట్టి పంపిణీని ఎక్కడికక్కడ నిరోధిస్తాం.

## పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- కలెక్టర్ శివలింగయ్య

జనగామ రూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల విధులు అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో మూడు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రిటర్నింగ్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. సంబంధిత నివేదికలు వెంట వెంటనే తనకు అందజేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్ భద్రత కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, సుహాసిని, ట్రెనింగ్ ఆధికారి అనిల్‌కుమార్, సీపీఓ ఇస్మాయిల్, డీపీఓ రంగాచారి, డీఆర్‌డీఓ మెగిలప్ప, ఆర్డీఓ మురళికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

**ఓటు హక్కును వినియోగించుకోవాలి**

జనగామ రూరల్: రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. మంగళవారం జనగామ ఆర్టీసీ డిపో వద్ద ఓటు హక్కు ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఓటు అత్యంత విలువైందని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. అలాగే జిల్లా పరిధిలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. అంతకు ముందు తెలంగాణ సాంస్కృతిక సారధులచే ఓటర్లను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడ్ అధికారి వినోద్‌కుమార్, డీఎం జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

**స్ట్రాంగ్ రూం తనిఖీ**

పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం, అంబేడ్కర్‌నగర్‌లోని పోలింగ్ కేంద్రాలు, సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఉన్న స్ట్రాంగ్ రూంలను మంగళవారం కలెక్టర్ శివలింగయ్య తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీఓ మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రజిత, డీపీఓ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నోడల్ ఆఫీసర్లు వీరే

జనగామ: సాధారణ ఎన్నికల సమయంలో ఎలక్షన్ విధులు, తదితర కార్యక్రమాల పర్యవేక్షణకు ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు జిల్లా ఎలక్షన్ అధికారి, కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య నోడల్ ఆఫీసర్లను నియమించారు. జిల్లా వ్యాప్తంగా 18 మంది అధికారులకు కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు.

| అధికారి | శాఖ | నోడల్ ఆఫీసర్(బాధ్యత) |
|---|---|---|
| కె.రాము | డీఈఓ | మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్,కమ్యూనికేషన్ ప్లాన్ |
| కె.అనిల్‌కకుమార్ | జెడ్పీ సీఈఓ | ట్రెనింగ్ మేనేజ్‌మెంట్ |
| ఎస్.కార్నేలియస్ | ఎస్సీ డెవలప్‌మెంట్ | మెటీరియల్ మేనేజ్‌మెంట్ |
| ఎస్.శ్రీనివాసరావు | డీటీసీ | ట్రాన్స్‌పోర్టు మేనేజ్‌మెంట్ |
| బి.విక్రమ్ | ఈడీ, ఎస్సీ కార్పొరేషన్ | కంప్యూటరైజేషన్‌సైబర్ సెక్యూరిటీ, ఐటీ |
| వి.వినోద్‌కుమార్ | డీపీఓ | స్వీప్ |
| కె.దేవేందర్‌రెడ్డి | ఏసీపీ | శాంతిభద్రతలు, వీఎం, సెక్యూరిటీ ప్లాన్ |
| వి.సుహాసిని | అడిషనల్ కలెక్టర్ | మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్, ఎలక్టరోల్ రోల్స్ |
| వై.రాజేందర్‌రెడ్డి | డీసీఓ | ఖర్చుల పర్యవేక్షణ |
| కె.అనిల్ కుమార్ | జెడ్పీ సీఈఓ | బ్యాలెట్‌పేపర్ |
| డాక్టర్ ఎస్ఎల్ మనోహర్ | ఏడీ, పశుసంవర్ధకశాఖ | పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ |
| రాజేంద్రప్రసాద్ | డీపీఆర్ఓ | మీడియా, ఎంసీఎంసీ |
| బి.నాగులు | మత్స్యశాఖ | ఫిర్యాదుల పరిష్కారం |
| దుర్గారావు | ఈడీఎం | ఓటరు హెల్ప్ లైన్ |
| ఆర్.చంద్రశేఖర్ | పీఆర్ ఈఈ | అబ్జర్వర్ |
| వసంత | జెడ్పీ డిప్యూటీ సీఈఓ | సంక్షేమం |

## రిజర్వాయర్ విస్తరణకు సహకరించాలి

- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

స్టేషన్‌ఘన్‌పూర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్పీ) నుంచి ఇందిరమ్మ వరద కాల్వ (ఐఎఫ్ఎఫ్‌సీ) ప్రాజెక్టులోని గౌరవెల్లి రిజర్వాయర్ 1.410 టీఎంసీ నుంచి 8.230 టీఎంసీల విస్తరణకు రైతులు సహకరించాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అన్నారు. ఇందిరమ్మ ఫ్లడ్ ఫ్లో కెనాల్ ప్రాజెక్టు విస్తరణపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ, అవగాహన సమావేశాన్ని మండలంలోని ఛాగల్లు రైతువేదికలో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్, రఘునాథపల్లి మండలాలకు చెందిన రైతులు హాజరుకాగా ముఖ్యఅతిథిగా అడిషనల్ కలెక్టర్ హాజరయ్యారు. ముందుగా వివిధ గ్రామాలకు చెందిన రైతులు తమ అభిప్రాయాలు, సందేహాలు తెలిపారు. రైతులకు ఏ ప్రాతిపదికన పరిహారం ఇస్తున్నారో తెలపాలని రైతులు కోరారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఫ్లడ్ ఫ్లో కెనాల్ ప్రాజెక్టు విస్తరణలో గౌరవెల్లి రిజర్వాయర్‌ను 1.410 టీఎంసీ నుంచి 8.23 టీఎంసీకి పెంచనున్నట్లు తెలిపారు. ఈ రిజర్వాయర్ నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల రాజన్న, పెద్దపెల్లి, హన్మకొండ, జనగాం, సిద్దిపేట 8 జిల్లాల నుంచి వెళ్తుందన్నారు. జనగామ జిల్లాలో స్టేషన్ ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్, రఘునాథపల్లి మండలాల్లో 19 గ్రామాల్లో 23,624 ఎకరాలకు సాగునీరు అందించేలా కెనాల్‌ను విస్తరించనున్నట్లు తెలిపారు. ప్రిలిమినరీ నోటిఫికేషన్ వచ్చాక పనులు ప్రారంభిస్తారని, 2013 భూసేకరణ చట్టం ద్వారా ప్రభుత్వ నిబంధనల మేరకు భూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం చెల్లిస్తారన్నారు. కెనాల్ విస్తరణ పనులు పూర్తయితే జనగామతో పాటు ఉమ్మడి జిల్లాకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, రైతులు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ఆర్.సునీత, ఏఈ ఎం.సుభాష్, ఇరిగేషన్ హుస్నాబాద్ 4వ డివిజన్ ఈఈ వెంకటక్రిష్టారావు, డీఈలు సురేష్, సుధాకర్, వీరభద్రయ్య, ఏఈలు అర్షద్, క్రిష్ణకాంత్, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, సర్పంచ్ పోగుల సారంగపాణి, రైతులు ఇనుగాల నర్సింహారెడ్డి, కనకం రమేష్, కనకం గణేష్, పొన్న రాజేష్, సింగపురం జగన్, నాగరబోయిన యాదగిరి, పంచాయతీ కార్యదర్శి అశ్విన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపు తథ్యం

- పొన్నాల బీఆర్ఎస్‌లో చేరడంతో కాంగ్రెస్‌కు నష్టం లేదు
- పల్లా కబ్జాలను బయటపెడతాం
- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: జనగామ నియోజకవర్గంలో లోకల్, నాన్ లోకల్ ఫైట్‌లో చివరకు విజయం తనదేనని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జనగామ పట్టణంలోని డీసీసీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం పక్కన ఉండే పల్లా.. జనగామ ప్రజలకు ఎలా అందుబాటులో ఉంటారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు కబ్జాకు గురైన భూమిని బయటకు తీస్తామన్నారు. పల్లా కబ్జాలను ఒక్కొక్కటిగా ప్రజల ముందు ఉంచుతామన్నారు. పొన్నాల లక్ష్మయ్యతో జనగామ కాంగ్రెస్‌కు జీరో పర్సంటేజ్ కూడా నష్టం లేదని, ప్రస్తుతం తటస్తులుగా ఉన్న నాయకులు, పలువురు పార్టీ శ్రేణులు ఇక నుంచి క్రియాశీలకంగా పని చేస్తారన్నారు. జనగామ కాంగ్రెస్ టికెట్ రెండు నెలల క్రితమే కన్ఫాం అయిందని, ఈ నెల 19 లేదా 20న అధికారికంగా ప్రకటిస్తారన్నారు. ఈ సమావేశంలో నాయకులు వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, కంచె రాములు, చారబుడ్ల రాందయాకర్‌రెడ్డి, వంగాల మల్లారెడ్డి, జిల్లెల్ల సిద్దారెడ్డి, ఉడుత రవియాదవ్, మేడ శ్రీనివాస్, గంగం నర్సింహారెడ్డి, గాదెపాక రాంచందర్, ముస్త్యాల దయాకర్, స్పత్, బనుక శివరాజ్, కొత్త కరుణాకర్ రెడ్డి, గంగరబోయిన మల్లేశం, బాల్దె ఆంజనేయులు, బాలరాజుగౌడ్, నల్లగోని బాలకిషన్‌గౌడ్, పిట్టల సతీష్, బండారు శ్రీనివాస్, రంగు రవి, క్రాంతి, బక్క ప్రవర్ధన్ తదితరులు ఉన్నారు.

# రామప్ప నుంచి శ్రీకారం

- నేడు ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక
- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో రెండు రోజులపాటు పర్యటన
- నేటి సాయంత్రం రామాంజాపూర్‌లో మహిళా విజయభేరి సభ
- మహిళా డిక్లరేషన్ ప్రకటించనున్న ప్రియాంక గాంధీ
- 30వేల మంది తరలింపునకు ఏర్పాట్లు
- గురువారం భూపాలపల్లిలో నిరుద్యోగ యువత బైక్ ర్యాలీ



రామాంజాపూర్‌లో జరిగే మహిళా విజయభేరి సభాప్రాంగణం



వెంకటాపురం(ఎం)/భూపాలపల్లి రూరల్ : ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయంనుంచే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనుంది. ఆ పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ జిల్లా పర్యటనకు వస్తుండడంతో స్థానిక కాంగ్రెస్ నేతల్లో ఉత్సాహం నెలకొంది. శాసనసభ ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచా రానికి సీతక్క నియోజకవర్గాన్ని రాహుల్‌గాంధీ ఎంపిక చేసుకోవడంతో రాష్ట్ర రాజకీయం ములుగు జిల్లా నుంచే వేడెక్కనుంది.

**నేటి సాయంత్రం 4గంటలకు రామప్పకు..**

బుధవారం సాయంత్రం 4గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ రామప్పలో ల్యాండింగ్ అవుతా రు. అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో రామప్ప ఆలయ ప్రధానగేటు వద్దకు చేరుకుంటారు. రామప్ప ఆలయానికి కాలినడకన చేరుకొని హిందూ సంప్రదాయపద్ధతిలో రామలింగేశ్వరస్వామికి రాహుల్ గాంధీ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే సీతక్క వెల్లడించారు. రామప్పలో పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక బస్సులో రామాంజాపూర్‌కు చేరుకొని ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించనున్నట్లు తెలిసింది, అనంతరం రామాంజాపూర్ శివారులో జరిగే మహిళ విజయభేరి సభలో పాల్గొంటారు. సభలో ప్రియాంకగాంధీచే రాహుల్‌గాంధీ మహిళా డిక్లరేషన్‌ను వెల్లడించనున్నారు.

**ఏర్పాట్లను పరిశీలించిన సీతక్క**

రాహుల్‌గాంధీ పర్యటన సందర్భంగా రామప్పలో హెలిపాడ్ ప్రాంతాన్ని, ఆలయాన్ని ఎమ్మెల్యే సీతక్క మంగళవారం పరిశీలించారు. జిల్లా ఎస్పీ గాష్ ఆలం ఆధ్వర్యంలో రామప్ప గార్డెన్‌లో జరిగిన అన్ని శాఖల అధికారుల సమన్వయ సమావేశానికి సీతక్క హాజరై రాహుల్ గాంధీ పర్యటన వివరాలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ గాష్ ఆలం మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రామాంజాపూర్ సభాస్థలికి చేరుకున్న సీతక్క.. భూపాలపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ శివభక్తుడని, అందుకే రామప్ప ఆలయం నుంచి ప్రచారాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. మహిళలకు భరోసా కల్పించే విధంగా ప్రియాంకగాంధీ మహిళా డిక్లరేషన్‌ను వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. సభకు ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాల నుంచి 30వేల మంది తరలిరానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని సీతక్క, గండ్ర సత్యనారాయణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మల్లాడి రాంరెడ్డి, రవళి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, సర్పంచ్ తుమ్మేటి రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**పర్యటన ఇలా..**

04:15 గంటలకు : రామప్ప ఆలయ సందర్శన
04:45 గంటలకు : రామప్ప ఆలయం నుంచి రామాంజాపూర్ వరకు విజయభేరి యాత్ర
5.30 గంటలకు : రామాంజాపూర్‌లో బహిరంగ సభ

**రేపు భూపాలపల్లికి..**

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్‌పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలు గురువారం భూపాలపల్లిలో పర్యటించనున్నారు. నిరుద్యోగ యువత నిర్వహించే భారీ బైక్ ర్యాలీలో రాహుల్ గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐయిత ప్రకాశ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ములుగు జిల్లా రామంజాపూర్‌లో బుధవారం జరిగే బహిరంగ సభ అనంతరం రాహుల్‌గాంధీ వెల్తుర్లపల్లి క్రాస్ రోడ్ నుంచి గణపురం మీదుగా జెన్‌కో గెస్ట్‌హౌస్ (గోదావరి గెస్ట్ హౌస్)కు చేరుకుంటారని, రాత్రి అక్కడే బస చేస్తారని వివరించారు. గురువారం ఉదయం 7:30 గంటలకు కేటీకే 5 ఇంక్లైన్ స్వాగత తోరణంనుంచి బాంబుల గడ్డ(సీఆర్‌నగర్) వరకు నిరుద్యోగ యువత నిర్వహించే భారీ బైక్ ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం తిరిగి రామగుండం పర్యటనకు వెళ్తారన్నారు. ర్యాలీలో పార్టీ కార్యకర్తలు, ప్రజలు, జిల్లాల్లోని నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## బీజేపీ అభ్యర్థులను ఆదరించాలి

- బెంగళూరు బీజేపీ ఎంపీ పీసీ మోహన్

జనగామ రూరల్: బీజేపీ అభ్యర్థులను ఎవరిని ప్రకటించిన ఆదరించి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బెంగళూరు బీజేపీ ఎంపీ పీసీ మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జూబ్లీ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు అరుట్ల దశమంత్‌రెడ్డి అధ్యక్షతన పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్, జనగామ బూత్ స్థాయి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మూడో సారి అధికారం ఇవ్వండి ఇక మిమ్ములను మీరు మరచిపోండి అని అంటున్నారని ఇందులో ఉన్న సారం ఎందో ప్రజలు తెలుసుకోవాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు వచ్చిన జనగామలో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండె విజయ రామారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్, మాదాసు వెంకటేష్, కల్నల్ భిక్షపతి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రవళిక ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి



మాట్లాడుతున్న రాములు యాదవ్

నయీంనగర్: ప్రవళిక ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బిక్కాజిపల్లి గ్రామానికి చెందిన మర్రి లింగయ్య యాదవ్ కుమార్తె ప్రవళిక హైదరాబాద్‌లో గ్రూప్–2 పరీక్షకు కోచింగ్ తీసుకుంటోందన్నారు. అయితే గ్రూప్–2 రద్దు కావడంతో మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించి ఆమె కుటుంబానికి రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వంశీ మోహన్‌యాదవ్, రమేష్ యాదవ్, మల్లన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా వెంకటేష్



నియామక పత్రం అందుకుంటున్న వెంకటేష్

హన్మకొండ: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా హనుమకొండలోని రాయపురకు చెందిన మునుకుంట్ల వెంకటేష్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండలోని సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో సంఘ బాధ్యుల చేతుల మీదుగా వెంకటేష్ నియామక పత్రం అందుకున్నారు. కాగా, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి, మహిళా అధ్యక్షురాలు బీమగానీ సౌజన్య, రాసమల్ల లక్ష్మణ, బండారి దేవేందర్, వరికెల కిషన్, శేఖర్, రేపల్లె రంగనాథ్‌కు వెంకటేష్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.





# నమస్తే పెట్టాల్సిందే..!

- జిల్లాలో చర్చనీయాంశంగా ఓ ఉన్నతాధికారి తీరు
- పలు అంశాలను ప్రస్తావిస్తూ మెమో
- ఆలస్యంగా వెలుగులోకి..

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లాలోని ఓ శాఖ ఉన్నతాధికారి తీరు ఎప్పుడూ వివాదాస్పదంగానే ఉంటుంది. డిస్ట్రిక్ హబ్ ఫర్ ఎంపవర్ మెంట్ ఆఫ్ ఉమెన్ ఉద్యోగ నియామకాలు.. చైల్డ్ లైన్ ఉద్యోగాల ఎంపికల్లో అనర్హులకు అందలం ఎక్కించారనే ఆరోపణలు వచ్చినా.. ఏకంగా కలెక్టర్‌నే తప్పుదోవ పట్టించిన సదరు అధికారి.. ఇప్పుడు ఏకంగా తన కింది స్థాయి సిబ్బందికి చుక్కలు చూపెడుతుందన్న ప్రచారం ఉంది. ఆమెకు నమస్తే పెడితే సరి.. లేదంటే తీవ్ర చర్యలుంటాయని మెమో జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అది కూడా 24 గంటల్లో సమాధానం చెబితే సరి.. లేదంటే మీపై విభాగపరంగా ఎందుకు చర్యలు తీసుకోకూడదో సమాధానం చెప్పాలంటూ హుకుం జారీ చేయడం గమనార్హం. ఈమె విభాగంలో పాలన గాడి తప్పుతున్నా కలెక్టర్ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటూ సిబ్బంది చర్చించుకుంటున్నారు.. కానీ, కలెక్టర్ ప్రావీణ్యకు అసలు విషయాలు తెలియకుండా ఈమె జాగ్రత్తపడుతూ కిందిస్థాయి సిబ్బందిని బెంబేలెత్తిస్తున్నారని తెలిసింది. ఇప్పటికే ఈమె ధాటికి ఓ విభాగానికి చెందిన కొందరు ఉద్యోగాలు వదిలిపెట్టి వెళ్లారంటే అరాచకం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కేవలం నమస్తే పెట్టకుంటే మెమో జారీ చేస్తే తప్పుడు ప్రచారం అవుతుందన్న ఆలోచనతో సదరు అధికారి ఇతర అంశాలను జోడిస్తూ సిబ్బందికి వణుకు పుట్టిస్తుండడంతో లోలోన సతమతమవుతున్నారన్న టాక్ ఉంది. సదరు ఉన్నతాధికారికి ఆ విభాగంలోని మరో ఇద్దరు అధికారులు తోడవ్వడంతో ఆయా విభాగాల సిబ్బంది సైతం భయంతోనే విధులు నిర్వర్తిస్తున్నట్లు సమాచారం.

**మెమోలోని అంశాలు..**

డీడబ్ల్యూఓకు అనవసర ఫిర్యాదులు చేయడం, సమయ పాలన పాటించకపోవడం, ఉన్నతాధికారులు, సహచర సిబ్బందికి నమస్తే పెట్టకపోవడం, కార్యాలయానికి అడ్వాన్స్‌డ్ టూర్ ప్రోగ్రాం సబ్మిట్ చేయకపోవడం, కార్యాలయ సిబ్బందితో సమన్వయం చేయలేకపోవడం, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించకపోవడం, ఉన్నతాధికారి అనుమతి లేకుండానే ఆఫీసు నుంచి వెళ్లిపోవడం, ఫీల్డ్ వర్క్ పూర్తయిన తర్వాత ఆఫీసుకు అటెండ్ కాకపోవడంతోపాటు అటెండెన్స్‌నే ఏమార్చారంటూ ఇటీవల జారీ చేసిన మెమోలో చేర్చడం గమనార్హం.

**సిబ్బంది ఆందోళన..**

కొన్నిసార్లు పని బిజీలో నమస్తే పెట్టకపోవడం వల్లే మనస్సులో ఉంచుకొని సదరు అధికారి ఇదంతా చేశారని, నమస్తే పెట్టలేదని ఇప్పటివరకు ఏ విభాగంలోనూ మెమో జారీ చేయలేదని సిబ్బంది లోలోన మదనపడుతున్నారు. ఇప్పటికే కొందరు ఉద్యోగులు ఈ వేధింపులు భరించలేక వెళ్లిపోయారని, ఇవి ఇలాగే కొనసాగితే మిగతావాళ్లు కూడా పనిచేయడం కష్టమని పేరు చెప్పడానికి ఇష్టపడని 'డిస్ట్రిక్ హబ్ ఫర్ ఎంపవర్ మెంట్ ఆఫ్ ఉమెన్' విభాగంలోని ఓ సిబ్బంది విచారం వ్యక్తం చేశారు. తమకు కావాల్సిన వారిని తిరిగి తెచ్చుకునేందుకే ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నారని పేర్కొన్నారు. అయితే సదరు అధికారి వేధింపుల్లో కొందరు సిబ్బందికి మినహాయింపు ఉండడం గమనార్హం. ఇప్పటికైనా కలెక్టర్ ప్రావీణ్య దృష్టి సారించి ఈ విభాగంలో జరుగుతున్న పరిణామాలను గమనించి, చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

# ఓవరాల్ చాంపియన్ తమిళనాడు

- మూడో స్థానంలో తెలంగాణ
- ముగిసిన 34వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలు

హన్మకొండ: అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన 34వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. అండర్–14, 16,18, 20 బాలబాలికల విభాగంలో మూడు రోజులు జరిగిన పోటీల్లో ఏడు రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొన్నారు. దాదాపు 48 ఈవెంట్లలో నిర్వహించిన పోటీల్లో క్రీడాకారులు నువ్వా..? నేనా అన్నట్లు తలపడ్డారు. పతకాల వేటలో 489 పాయింట్లు సాధించి తమిళనాడు అథ్లెట్లు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. రెండో స్థానంలో కర్ణాటక 204 పాయింట్లతో ట్రోఫీని అందుకుంది. కాగా, ఆతిథ్య తెలంగాణ క్రీడాకారులు 170 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచారు. అండర్–14 బాలబాలికల విభాగంలో టీమ్ చాంపియన్‌షిప్‌ను తెలంగాణ క్రీడాకారులు అందుకున్నారు. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా ఆర్మీ అధికారి కల్నల్ హుస్సేన్ హాజరై విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ అశోక్, అథ్లెటిక్స్ సంఘం బాధ్యులు సారంగపాణి,కుమార్ యాదవ్, ఐలి చంద్రమోహన్‌గౌడ్, డీఎస్ఏ కోచ్ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.






షార్ట్‌ఫుట్ వేస్తున్న బాలుడు, స్టీప్‌లీచేస్ విభాగంలో పోటీ పడుతున్న బాలికలు, 400 మీటర్ల మహిళా విభాగంలో తలపడుతున్న క్రీడాకారులు

# సమసమాజ స్థాపనకు ఉద్యమించాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

హసన్‌పర్తి: విద్యార్థులు రాజకీయంగా ఎదగడం ద్వారానే మెరుగైన సమాజం సాధ్యమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సమసమాజ స్థాపనకు విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండలం ఎర్రగట్టు క్రాస్‌లోని మిత్ర కన్వెన్షన్ హాల్‌లో మూడు రోజులు నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక, సైద్ధాంతిక శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో విద్యార్థులు, యువకులను ఏకం చేసి బ్రిటిష్ వారిని తరిమికొట్టడంలో ఏఐఎస్ఎఫ్ కీలక పాత్ర పోషించిందన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) విద్యార్థులకు ప్రశ్నించే తత్వం నేర్పుతోందన్నారు. ప్రస్తుతం దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని తెలిపారు. కవులు, కళాకారులు, రచయితలతో పాటు ప్రజల కోసం మాట్లాడే వారిపై 'ఉపా' కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కుల, మతాల పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. బీజేపీని దేశం నుంచి తరిమివేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడిన వారమవుతామన్నారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు తక్కళపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం చదువుతూ ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నవ చేతన విజ్ఞాన సమితి కార్యదర్శి మోహన్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జాతీయు ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, నాయకులు రామకృష్ణ, నాగజ్యోతి, భిక్షపతి, శరత్, జనార్ధన్, లోకేష్, రవితేజ,చరణ్ పాల్గొన్నారు.

## రుద్రేశ్వరి అమ్మవారికి పల్లకీసేవ



రుద్రేశ్వరీదేవి అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

హన్మకొండ కల్చరల్ : రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజు మంగళవారం అమ్మవారికి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో గణపతి ఆరాధన, శ్రీరుద్రేశ్వరుడికి రుద్రాభిషేకం, శ్రీరుద్రేశ్వరి అమ్మవారికి చతుఃషష్టి ఉపచార, శోడషోపచార పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీపై ప్రతిష్ఠించి ఊరేగించారు. శ్రీభవానీదేవి ఉత్సవ విగ్రహాన్ని గాయత్రిగా అలంకరించి మారేడు బిల్వ దళార్చన చేశారు. భవాని దీక్షాధారులు గాయత్రి మంత్రాన్ని పఠించారు. యాగశాలలో చండీ యాగం నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు అనిల్‌కుమార్, రమేష్ ఉభయదాతలుగా వ్యవహరించారు. భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు. పల్లం రమేష్, కోన శ్రీకర్, రాజు, పులి రజనీకాంత్, కిషన్‌లాల్ భక్తులకు సేవలందించారు. ఆలయ ఈఓ వెంకటయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయంత్రం ప్రదోషకాల పూజల అనంతరం ఝాన్సీ శిష్య బృందం కూచిపూడి నృత్యాలు చేసింది.

# అందుబాటులో లేని ఆర్ఎంఓలు

- రాత్రివేళ ఎంజీఎంలో రోగులకు అందని వైద్యసేవలు
- 1200 పడకల ధర్మాస్పత్రిలో పీజీ డాక్టర్లే దిక్కు
- పీఆర్వోల ఫోన్లు స్విచ్ఛాఫ్

ఎంజీఎం : ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక ఎంజీఎం ఆస్పత్రిలో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి వేళ డ్యూటీ డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో వైద్య సేవలు అందడం లేదు. కరీమాబాద్ ఎస్ఎస్ఆర్ తోటకు చెందిన పల్లం రాజుకు మంగళవారం ఉదయం నాలుగు గంటలకు ఛాతిలో నొప్పి రావడంలో కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఉన్న పీజీ డాక్టర్లు చికిత్స చేసి అల్ట్రా స్కానింగ్‌కు రెఫర్ చేశారు. ఆ సమయంలో వైద్యులు అందుబాటులో లేరు. కాగా, ఓ రోగి అటెండెంట్ పీఆర్వోకు ఫోన్ చేశాడు. సదరు పీఆర్వో ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని, విధులకు డుమ్మా కొట్టాడు. దీంతో గత్యంతరం లేక రోగిని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎంజీఎం ఆస్పత్రిలో 24 గంటలపాటు పర్యవేక్షించాల్సిన ఆర్ఎంఓలు, ఆడిషనల్ ఆర్ఎంఓలు.. ఉన్నతాధికారులు వచ్చే సమయానికి హాజరు వేసుకుంటూ మధ్యాహ్నం తర్వాత విధులకు ఎగనామం పెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక డ్యూటీ మెడికల్ ఆఫీసర్, సర్జన్, ఆర్థోపెడిక్ డాక్టర్లు ఏ వార్డులో ఉంటారో అర్థం కాదు. ఆస్పత్రిలో ఎవరు విధులు నిర్వర్తిస్తున్నారో, ఎవరు విధులకు హాజరు కావడం లేదో తెలియని పరిస్థితి నెలకొంది.

**రాత్రి వేళ ఫోన్లు ఎత్తరు..**



వైద్యులు లేకుండా ఉన్న స్కానింగ్ గది

ఎంజీఎం ఆస్పత్రిలో కొన్ని నెలలుగా రాత్రి వేళ ఆర్ఎంఓలు విధులు నిర్వర్తించిన దాఖలాలు లేవు. ఆ సమయంలో వారు ఫోన్లు కూడా ఎత్తరని విమర్శలు ఉన్నాయి. ఆర్ఎంఓ (రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్)లు 1200 పడకల ధర్మాస్పత్రిలో నిత్యం అందుబాటులో ఉండి సేవలందించాలి. కానీ, ఏ ఆర్ఎంఓ ఎప్పుడు వస్తాడో.. ఎప్పుడు వెళ్తాడో తెలియదు. వీరికి తోడు పెద్ద సంఖ్యలో ఉన్న అడిషనల్ ఆర్ఎంఓల విధులు ఎక్కడ నిర్వర్తిస్తున్నారో అర్థం కాదు.

**ఆర్ఎంఓలు, పీఆర్ఓల నంబర్లు బోర్డుపై ప్రదర్శించాలి**

ఎంజీఎం ఆస్పత్రి ప్రాంగణంలో ఆర్ఎంఓలు, పీఆర్వోల నంబర్లు ప్రదర్శించాలి. దీంతో వైద్య సేవల్లో లోపాలపై అధికారులను ప్రశ్నించవచ్చు. ఆస్పత్రి క్యాజువాలిటీ విభాగంలోని నోటీసు బోర్డుపై డ్యూటీ డాక్టర్ల ఫోన్ నంబర్లు కానరావు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పర్యవేక్షించి ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని రోగులు, రోగుల సహాయకులు కోరుతున్నారు.

## గాయత్రి మాతగా అమ్మవారికి అలంకరణ



గజవాహనంపై అమ్మవారు

హన్మకొండ కల్చరల్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భద్రకాళి దేవాలయంలో మంగళవారం అమ్మవారిని గాయత్రి మాతగా అలంకరించారు. ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో చంద్రఘంటా క్రమంలో పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని సింహవాహనంపై ఊరేగించారు. సాయంత్రం అమ్మవారికి మహిషాసురమర్దిని క్రమంలో పూజలు చేసి గజ వాహనంపై ఊరేగించారు. వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ఈఓ శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# చికిత్స పొందుతున్న యువకుడి మృతి

చెన్నారావుపేట: చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని ముగ్దుంపురంలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన పెండ్యాల అనిల్ (29) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 12న ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య రమ్య, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.



అనిల్(ఫైల్)

# హ్యాండ్ బ్యాగుల పట్టివేత



బ్యాగులను ఆటోలో తరలిస్తున్న అధికారులు



శాయంపేట : నగదుతో ఎస్సై దేవేందర్

కాశిబుగ్గ : రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అనుమతి లేకుండా ఢిల్లీ నుంచి వరంగల్‌కు చేరుకున్న 2,400 లేడీస్ హ్యాండ్ బ్యాగులను వరంగల్ ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం వరంగల్ రైల్వే స్టేషన్‌లోని పార్సిల్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టగా పెద్ద మొత్తంలో రెండు ప్యాకింగ్‌లో 2,400 లేడీస్ హ్యాండ్ బ్యాగులు కనిపించాయి. వాటిని పరిశీలించగా దివాన్ అనే వ్యక్తి పేరు మీద ఢిల్లీ నుంచి వరంగల్‌కు చేరుకున్నట్లు తెలిసింది. దీంతో బ్యాగులకు స్వాధీనం చేసుకుని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ మాధవరెడ్డికి అప్పగించామని జీఆర్పీ సీఐ నరేష్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న హ్యాండ్ బ్యాగుల విలువ సుమారు రూ. 4.80 లక్షలు ఉంటుందన్నారు.

**మాందారిపేటలో వాహన తనిఖీలు**

శాయంపేట : మండలంలోని మాందారిపేట క్రాస్ వద్ద సోమవారం అర్ధరాత్రి ఎస్సై దేవేందర్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో భాష ఎంటర్‌ప్రైజెస్, జెమిని డిస్ట్రిబ్యూటర్ ఎండీ రాజబెల్లి వద్ద ఆధారం లేకుండా తరలిస్తున్న రూ. లక్షా 14వేల నగదు లభ్యమైంది. దీంతో ఆ నగదును స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌కు పంపినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

# తెలంగాణలో కాంగ్రెస్ గాలి

- ఏఐసీసీ అధికార ప్రతినిధి డాలీశర్మ



మాట్లాడుతున్న డాలీశర్మ, పక్కన ఇతర నేతలు

నయీంనగర్: తెలంగాణలో కాంగ్రెస్ గాలి వీస్తోందని, రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి వస్తుందని ఏఐసీసీ అధికార ప్రతినిధి డాలీశర్మ అన్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను అర్థం చేసుకుని కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణ ఇచ్చిందన్నారు. ప్రాణత్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో పేదల ఆశలు నీరుగారాయన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు. తెలంగాణను కేసీఆర్ కుటుంబం దోచుకుందని, నియంత పాలనలో తెలంగాణ ప్రమాదంలో ఉందన్నారు. సోనియాగాంధీ.. కేసీఆర్ కుటుంబం కోసం తెలంగాణ ఇవ్వలేదన్నారు. సోనియాగాంధీ కోరుకున్న తెలంగాణ ఇది కాదన్నారు. ప్రవళిక ఆత్మహత్యతో అధికార పార్టీకి చెడు పేరు వస్తదని తెలిసి ఆమె మరణాన్ని వక్రీకరించిందని మండిపడ్డారు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ బుధవారం సాయంత్రం 4 గంటలకు ములుగు జిల్లాలోని రామప్ప దేవాలయాన్ని దర్శించుకుంటారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల మేనిఫెస్టోకు ప్రత్యేక పూజలు చేసి బస్సు యాత్ర ప్రారంభిస్తారన్నారు. తెలంగాణ ప్రజలు రాహుల్ గాంధీ యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ఏఐసీసీ అబ్జర్వర్, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమ్ రావ్ దళ్వి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు వి.శోభారాణి, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నాయకులు ఇనగాల వెంకట్రాంరెడ్డి, బక్క జడ్సన్, డాక్టర్ పులి అనిల్‌కుమార్, కేఆర్ నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

# రేవూరికి 'పేట'తో తెగనున్న బంధం

- బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం
- పరకాల అభ్యర్థిగా హామీ లభించినట్లు సమాచారం!



రేవూరి ప్రకాశ్‌రెడ్డి

నర్సంపేట: దాదాపు 20 ఏళ్లుగా నర్సంపేట నియోజకవర్గంతో రాజకీయ అనుబంధం ఉన్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి నియోజకవర్గానికి దూరం కానున్నారు. ఇక్కడ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు తెలంగాణ ఉద్యమ సమయంలో 610 జీఓ హైపవర్ కమిటీ చైర్మన్‌గా, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఆయన కొనసాగారు. అనంతరం 2019లో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. నాటి నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతూ.. ఎన్నికల సమయంలో ఉన్న ఫలంగా బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. పరకాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆ పార్టీ అధిష్ఠానం నుంచి హామీని పొందిన తర్వాతే పీసీసీ అధ్యక్షుడితో ఆదివారం భేటీ అయినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ టైగర్‌గా పేరొందిన మద్దికాయల ఓంకార్ వరుసగా ఐదుసార్లు నర్సంపేట ఎమ్మెల్యేగా కొనసాగుతూ వస్తున్న క్రమంలో 1994లో ఓంకార్‌ను ఓడించి చరిత్ర సృష్టించారు. ఆ తర్వాత 2009లో టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2018లో మహా కూటమి నుంచి నర్సంపేట అభ్యర్థిగా అవకాశం లభించకపోవడంతో హనుమకొండ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి ఓటమి పాలయ్యారు. ఆతర్వాత తిరిగి 2019లో బీజేపీలో చేరి నర్సంపేటలో పునఃరాజకీయాన్ని చేస్తూ.. త్రిముఖ పోటీ ఉంటుందనే పరిస్థితిలో బీజేపీ నాయకుడిగా కొనసాగారు. టీడీపీలో కొనసాగుతూ ఎమ్మెల్యేగా పని చేసిన సమయంలో తనకు దగ్గరగా ఉన్న క్యాడర్‌ను బీజేపీ వైపు మలచుకోవడంలో కొంత వరకు సఫలీకృతమయ్యారు. బీజేపీ ద్వితీయ శ్రేణి క్యాడర్‌కు తెలియకుండానే ఆ పార్టీని వీడి మరో రెండు రోజుల్లో కాంగ్రెస్‌లో చేరి పరకాల నుంచి పోటీకి సిద్ధం కావడంతో రేవూరి ప్రకాశ్‌రెడ్డికి నర్సంపేటకు ఉన్న బంధం వీడినట్లేనని పలువురు చర్చించుకుంటున్నారు.

# నగదు రవాణాలో సడలింపు ఇవ్వాలి

- చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

వరంగల్: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో రైతులు, అడ్తిదారులు, వ్యవసాయ మార్కెట్ వ్యాపారులకు నగదు రవాణా పరిమితులపై సడలింపు ఇవ్వాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టర్, వరంగల్ పోలీస్ కమిషనర్‌తో పాటు రాష్ట్ర ఎన్నికల అధికారిని ఒక ప్రకటనలో అభ్యర్థించారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో రోజూ వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించే క్రమంలో వర్తక సంఘం ద్వారా రైతులు, అడ్తిదారులకు భారీ మొత్తంలో నగదు చెల్లించడం అనివార్యమన్నారు. అయితే ఎన్నికల కోడ్ నేపథ్యంలో నగదు తీసుకు వెళ్లే క్రమంలో వీరు పోలీసుల తనిఖీలతో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నగదు రవాణా పరిమితులపై అవగాహన కల్పిస్తున్నామని, నగదుతో పాటు రశీదులు దగ్గర ఉంచుకోవాలని తాము చెబుతున్నప్పటికీ వారికి ఇబ్బందులు తప్పడం లేదన్నారు. దీనిపై స్పందించి రైతులు, అడ్తిదారులు, వ్యవసాయ మార్కెట్ వ్యాపారులకు నగదు రవాణా పరిమితులపై సడలింపు ఇవ్వాలని రవీందర్‌రెడ్డి కోరారు.

# ఉద్యోగులు హెడ్ క్వార్టర్స్‌లో ఉండాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు



మాట్లాడుతున్న సీఎండీ గోపాల్‌రావు

కాజీపేట అర్బన్ : విద్యుత్ ఉద్యోగులు హెడ్ క్వార్టర్స్‌లో ఉంటూ విధులు నిర్వర్తించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు ఆదేశించారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో డైరెక్టర్లు, డీఈ,ఏఈలతో మాట్లాడారు. బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్ అంతరాయాలు లేకుండా సబ్ స్టేషన్ల నిర్వహణ చేపట్టాలని, ఆన్‌లైన్ బిల్లుల చెల్లింపులపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. బకాయి వసూళ్లు చేసి రెవెన్యూ కలెక్షన్లు పెంచాలని ఆదేశించారు. బిల్‌స్టాప్, డిస్ కనెక్షన్ సర్వీస్‌లను పరిశీలించాలని, ట్రాన్స్‌ఫార్మర్లు డిపార్ట్‌మెంట్ వాహనాల్లో తరలించాలని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వరరావు, గణపతి, సంధ్యారాణి, మోహన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సీజీఎంలు అశోక్‌కుమార్, మధుసూదన్, రాజుచౌహాన్, భీకం సింగ్,తదితరులు పాల్గొన్నారు.

**విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించాలి**

టీఎస్ఎన్పీడీసీఎల్ పరిధి 17 జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2013 సంవత్సరం నుంచి టీఎస్ఎన్పీడీసీఎల్ డిజిటల్ పేమెంట్ సౌకర్యం కల్పిస్తోందని తెలిపారు. 13 లక్షల మంది వినియోగదారులు ఆన్‌లైన్‌లో పేమెంట్స్ చేస్తున్నారన్నారు. మొబైల్‌లో యూపీఐ ద్వారా ఆన్‌లైన్ పేమెంట్స్‌తో సమయం ఆదాతో పాటు నగదు తీసుకెళ్తున్న సమయంలో చోటు చేసుకునే ఘటనలను నివారించొచ్చని సీఎండీ గోపాల్‌రావు తెలిపారు.